# సర్కారు 'భద్రత'ను నమ్మలేం... హెల్త్ పాలసీ తీసుకోండి!

- టర్మ్ పాలసీ కూడా తీసుకుంటే.. మరీ మంచిది
- పోలీసుశాఖ సిబ్బందికి ఉన్నతాధికారుల సూచనలు
- ఆరోగ్య భద్రత కార్డు ద్వారా అందని ప్రైవేటు వైద్యం
- నిధుల విడుదలలో కాంగ్రెస్ ప్రభుత్వం అలసత్వం
- సర్కార్ స్కీమ్‌పైనే ఆధారపడొద్దని అధికారుల సలహా



హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): పోలీసు ఆరోగ్య భద్రత పథకంలో అందుతున్న వైద్య సేవల తీరుపై ఆశాఖలోని అధికారులు, సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎస్ఐ, సీఐ, డీఎస్పీ స్థాయి అధికారులు పోలీసు ఆరోగ్య భద్రతపైనే ఆధారపడకుండా ప్రైవేట్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు కూడా చేయించుకుంటున్నారు. ప్రభుత్వ వైఖరిపై కానిస్టేబుల్ ఉంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు బాహాటంగానే అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

### ఏమైనా అయితే ఎవరు దిక్కు?

ఆరోగ్య భద్రతపై పోలీసుశాఖలో అంతర్గతంగా తీవ్ర చర్చ జరుగుతున్నది. కొందరైతే తమ వాట్సాప్ గ్రూపుల్లో ప్రభుత్వంపై నేరుగా అభ్యంతరాలను వ్యక్తపరుస్తున్నారు. కింది స్థాయి సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. "ఎందుకైనా మంచిది.. మీరు ప్రైవేట్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోండి. అందరూ మనకు భద్రత ఉందనుకుంటున్నారు. కానీ.. భద్రతకు కొన్ని పరిమితులు ఉన్నాయి. కొన్నిరకాల ఆపరేషన్లకు ఆరోగ్యభద్రతకార్డు ద్వారా లక్ష రూపాయలు మాత్రమే వర్తిస్తుంది. కానీ ఆపరేషన్‌కు రూ.5 లక్షలు ఖర్చయితే.. మిగిలిన రూ.4 లక్షలు మనమే కట్టుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ ఉంటే.. మొత్తం ఇన్సూరెన్స్ ద్వారా కవర్ అవుతుంది. వెంటనే అందరూ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోండి. వీలైతే టర్మ్ పాలసీ కూడా చేయించుకోండి. కోటి రూపాయల వరకు వస్తాయి" అని ఓ అధికారి వాట్సాప్ గ్రూపులో చెప్పారు. ఇప్పుడు ఈ మెస్సేజ్ పోలీసుశాఖలోని వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నది.

### గాలిలో దీపంలా మారింది

నిరుడు అక్టోబర్‌లో గుండెపోటు వచ్చిన ఏఆర్ ఎస్సై జనార్దన్‌రావును 'గోల్డెన్ అవర్'లో ఓ ప్రముఖ ప్రైవేటు దవాఖానకు తరలించారు. పోలీసు ఆరోగ్య భద్రత కార్డు ద్వారా చికిత్సకు వైద్యులు నిరాకరించారు. మరో రెండు హాస్పిటళ్లకు తరలించినా "పోలీసు ఆరోగ్య భద్రతా?.. దాంతో వైద్యం చేయలేం" అని మొహం మీదనే చెప్పడంతో అప్పటికే సమయం మించిపోయి అతను చనిపోయాడు. ప్రభుత్వ ఆరోగ్యభద్రత కార్డుతో భద్రత నామమాత్రమేనని గుర్తిం చి.. అప్పట్నుంచీ పోలీసులు అసంతృప్తిగా ఉన్నారు. తమ జీతం నుంచి నెలనెలా మెడికల్ విభాగంలో డబ్బులు కట్ చేస్తున్న ప్రభుత్వం.. తమ కోసం ఖర్చు చేసేందుకు మాత్రం వెనుకాడడమేంటని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో తమ ప్రాణాలు గాల్లో దీపంలా మారాయని వాపోతున్నారు.

## లోకం పోకడ




వీళ్లంతా బీఆర్ఎస్ రజతోత్సవ ప్రసంగం టీవీలో లైవ్ చూశారట.. వీళ్లను కూడా కట్ చేసి పారేద్దాం!

## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నిజామాబాద్ | 42.4°c | 28.2°c |
| ఆదిలాబాద్ | 42.0°c | 24.3°c |
| వరంగల్ | 42.0°c | 25.0°c |
| రంగారెడ్డి | 41.8°c | 17.9°c |
| మెదక్ | 41.7°c | 22.8°c |
| నల్లగొండ | 40.5°c | 24.5°c |
| హైదరాబాద్ | 39.6°c | 25.1°c |
| ఖమ్మం | 39.0°c | 27.0°c |
| మహబూబ్‌నగర్ | 38.0°c | 26.0°c |
| కరీంనగర్ | 38.0°c | 27.0°c |

### • సారూ.. నేను చచ్చిపోకముందే ఇల్లు ఇప్పించండి



'నాకు గుండె జబ్బు ఉంది.. నేను ఎప్పుడు చనిపోతానో తెలియదు, నేను చనిపోకముందే నా కుటుంబానికి ఇల్లు ఉండాలన్నదే కోరిక.. ఇందిరమ్మ ఇండ్ల మొదటి జాబితాలో ఇవ్వలే.. రెండో జాబితాలో వస్తుందని ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెప్తున్నరు.. అధికారులు దయచేసి ఇల్లు ఇప్పించండి సారూ..' అని మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గిరిపురం గ్రామానికి చెందిన షేక్ పాషా అధికారులను దీనంగా వేడుకున్నాడు. ఇందిరమ్మ లిస్టులో నా పేరు 17వ నంబర్‌లో ఉంది.. మా గ్రామంలో 16 ఇండ్లు మాత్రమే మంజూరు చేశారు. నాకు రెండో లిస్టులో ఇల్లు ఇస్తామని చెప్పి 16మంది పేర్లను ప్రకటించారు. కానీ నాకంటే పేదలు ఎవరైనా ఉంటే ఇవ్వండి లేదా నాకు ఇవ్వండి..' అని రోదిస్తూ షేక్‌పాషా వేడుకుంటున్నాడు.– మరిపెడ

### • భట్టి సారూ.. ఇల్లు ఉన్న వారికేనా మాకు ఇవ్వరా?



'భట్టి సారూ.. ఇల్లు ఉన్న వారికే మళ్లీ మళ్లీ ఇల్లు ఇస్తున్నారు. లేని వారికి ఇవ్వరా? మాలాంటి పేదవారికి ఇల్లు ఇవ్వకపోతే ఎలా సార్' అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను పలువురు మహిళలు నిలదీశారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న భట్టిని కొందరు మహిళలు కలిసి ఇండ్ల సమస్య గురించి విన్నవించారు. ఇప్పటికీ ఎవరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాలేదని, ఎవరో చెప్పిన మాటలు నమ్మొద్దని డిప్యూటీ సీఎం భట్టి మహిళలకు చెప్పారు. – మధిర

## ఇండ్ల కోసం ట్యాంకు ఎక్కి నిరసన

జూలూరుపాడు: ఇందిరమ్మ ఇండ్ల జాబితా నుంచి అనర్హుల పేర్లు తొలగించి.. అర్హులకే ఇండ్లు కేటాయించాలని కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం బేతాళపాడు పంచాయతీ పరిధిలోని రేగళ్లతండాకు చెందిన గిరిజనులు శనివారం వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలిపారు. పేదలకు ఇండ్లు కేటాయించకుండా ఆస్తులు ఉన్న వారికి కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. అనర్హులకు కేటాయించిన ఇండ్లను రద్దు చేసే వరకు కిందికి దిగేది లేదని భీష్మించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో కిందకు దిగి నిరసన విరమించారు.

# విస్తీర్ణం పెరిగితే కేంద్రసాయం కట్!

మొదటిపేజీ తరువాయి...

రూ.1.3 లక్షల చొప్పున కేంద్రం సాయం అందిస్తున్నది. పట్టణ ప్రాంతాల్లో అయితే రూ. 2.5 లక్షల వరకు ఆర్థికసాయం అందిస్తున్నది. అర్బన్‌లో ఇంటి వైశాల్యం 30 చ.మీ., గరిష్ఠంగా 45 చ.మీ. మించరాదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి వైశాల్యం 25 చదరపు మీటర్లకు తగ్గకుండా ఉండాలన్న నిబంధన ఉన్నది. ఇంతకంటే ఎక్కువ వైశాల్యంలో నిర్మించాలనుకుంటే కేంద్ర గృహ నిర్మాణ మంత్రిత్వశాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు నిరుడు చివర్లోనే కేంద్రం స్పష్టమైన నిబంధనలు విడుదల చేసింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం దీనిని గుర్తించకుండా ఎంత వైశాల్యంలోనైనా నిర్మించుకోవచ్చని మొదట చెప్పింది. మొదటి విడత ఇండ్ల నిర్మాణం మొదలయ్యాక కేంద్ర సాయం కోసం దరఖాస్తు చేసిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిబంధనలు చూసుకుని జరిగిన పొరపాటును గుర్తించింది.

### ఇప్పుడేం చేద్దాం?

ఈ ఏడాది 4.5 లక్షల ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 72,045 ఇండ్లను మంజూరు చేసింది. ఇందులో చాలావరకు గ్రౌండ్ అయ్యాయి. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం పునాదులు పూర్తయ్యాక మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ విడుదల చేయాల్సి ఉంది. అయితే కొన్ని ఇండ్లు 600 చదరపు అడుగులకన్నా అధికంగా ఉండటంతో వాటికి కేంద్రం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం లేకుండా పోయింది. దీంతో ఏమి చేయాలో అర్థంకాక రాష్ట్ర ప్రభుత్వం తలపట్టుకుంటున్నది. అదనపు వైశాల్యంలో నిర్మించుకున్న ఇండ్లను రద్దుచేయాలా? లేక కేంద్రంతో సంబంధం లేకుండా రూ. 5 లక్షలు మొత్తం తమ ఖజానా నుంచే ఇవ్వాలా? అన్న విషయాన్ని తేల్చుకోలేకపోతున్నది.




### పట్టణ ప్రాంతాలకు అధిక సాయం

గ్రామీణ ప్రాంతాలతో పోల్చుకుంటే పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం అధికంగా నిధులు విడుదల చేస్తున్నది. గృహనిర్మాణ పథకంలో సైతం పట్టణ ప్రాంతాల్లో ఒక్కో యూనిట్‌కు రూ. 2.5 లక్షలుగా ఆర్థిక సాయం అందిస్తున్నది. తెలంగాణలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు కలిపి మొత్తం 147 పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయి. ఇందులో జీహెచ్‌ఎంసీ, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, రామగుండం, మహబూబ్‌నగర్, మంచిర్యాల, ఖమ్మం తదితర 15 మున్సిపల్ కార్పొరేషన్లు కాగా, 131మున్సిపాలిటీలు ఉన్నాయి. దీంతో పీఎంఏవై(అర్బన్)లో భాగంగా ఈ ప్రాంతాల్లో మంజూరయ్యే ఇండ్లకు ఒక్కో యూనిట్‌కు రూ. 2.5 లక్షల చొప్పున సాయం అందుతుంది. గ్రామీణ ప్రాంతాలతో పోల్చుకుంటే పట్టణాల్లో నిర్మించే ఇండ్లకు రాష్ట్ర ప్రభుత్వంపై తక్కువ భారం పడుతుంది.

### రూ. 5 లక్షలు ఇస్తున్నది మేమే

పేదల ఇండ్లకు యూనిట్‌కు రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్న దేశంలోని ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రూ.22 వేల కోట్లతో ఏడాదికి 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపికను త్వరలోనే పూర్తిచేస్తామని, పైలట్ గ్రామాల్లో ఇప్పటికే ఇండ్ల నిర్మాణం చురుగ్గా సాగుతున్నదని వివరించారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్‌లో) శిక్షణ పూర్తిచేసుకున్న 350 మంది గృహనిర్మాణ సంస్థ ఔట్‌సోర్సింగ్ ఇంజినీర్లకు శనివారం మంత్రి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఒక్కరికే రూ. 5 లక్షలు అందిస్తున్న పథకం లేదని చెప్పారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు సైతం కేంద్రం ఇచ్చే నిధులతోనే సరిపెడుతున్నాయని పేర్కొన్నారు. వివిధ దశల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ప్రతీ సోమవారం చెల్లింపులు చేస్తున్నామని మంత్రి వివరించారు.



### • ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్థుల ధర్నా

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో పేదలమైన తమకు అన్యాయం చేసిండ్రని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం హత్తిని గ్రామస్థులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామ సభలు నిర్వహించకుండానే కాంగ్రెస్ నాయకులు, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులు కుమ్మక్కై డబ్బులు తీసుకొని వారికి నచ్చిన వాళ్లకు ఇండ్లు కేటాయించారని ఆరోపించారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. – దహెగాం

## ఈ నెలలోనూ వేతనాలు ఆలస్యమే

- మానసికంగా, ఆర్థికంగా సిద్ధంగా ఉండండి
- అధికారుల నుంచి హోంగార్డులకు ఆదేశాలు

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని హోంగార్డులకు ఈ నెల కూడా వేతనాలు ఆలస్యం కానున్నాయి. ఈ మేరకు వారిని ప్రభుత్వం ఇప్పటినుంచే మానసికంగా సిద్ధం చేస్తున్నది. నిత్యం గొడ్డుచాకిరీ చేస్తున్న తమను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని హోంగార్డులు మండిపడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతి నెలా మొదటి వారంలోనే వేతనాలు అందేవి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన దగ్గర్నుంచి ఆ పరిస్థితి మారిపోయింది. ప్రతి నెలా 10వ తేదీ తర్వాతే హోంగార్డుల ఖాతాల్లో వేతనాలు పడుతున్నాయి. గత ఐదారు నెలలుగా 13-15వ తేదీ తర్వాతనే వేతనాలు పడ్డాయి. తాజాగా ఇప్పుడు ఈ నెల వేతనం మరింత ఆలస్యంగా రాబోతున్నట్టు ఉన్నధికారులు చెప్తున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం నుంచి హోంగార్డుల వాట్సాప్ గ్రూపుల్లో ఆర్ఐలు ఓ సందేశాన్ని సర్క్యులేట్ చేస్తున్నారు. 'సీపీ, హోంగార్డ్ కమాండెంట్ ఉత్తర్వుల ప్రకారం.. కాలం నంబర్ 27పై ఆన్‌లైన్ ప్రాసెస్ జరుగుతున్నందున ఈ నెలలో హోంగార్డులకు వేతనాల చెల్లింపు ఆలస్యం కానున్నట్టు తెలుస్తున్నది. కావున అందరూ మానసికంగా, ఆర్థికంగా వెసులుబాటు చేసుకోవాలని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు' అని ఆ సందేశంలో పేర్కొన్నారు. దీనిపై హోంగార్డులు తీవ్రంగా మండిపడుతున్నారు.

### ప్రజాపాలనలో రోజుల తరబడి

కాంగ్రెస్ హయాంలో జీతం కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితులు దాపురించాయని హోంగార్డులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో తమ వేతనం బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోవడంతో చెక్కులు అవుతున్నాయని, ఫలితంగా ఈఎంఐల గడువు ముగిసి సిబిల్ స్కోర్ తగ్గిపోతున్నదని బాధపడుతున్నారు. వేతనాల చెల్లింపులో జాప్యం వల్ల ఇంటి ఖర్చులకు ఇబ్బంది పడాల్సి వస్తున్నదని, లోన్లు రాక, సకాలంలో క్రెడిట్ కార్డు బిల్లులు, ఇతర ఈఎంఐలు చెల్లించలేక ప్రతినెలా నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. చిన్న ఉద్యోగులమైన తమకు సక్రమంగా వేతనాలు ఇవ్వకపోవడం దారుణమని ఆవేదన చెందుతున్నారు. వేతనాల కోసం అధికారులను అడిగితే ఇష్టమొచ్చినట్టు దుర్భాషలాడుతున్నారని కన్నీటి పర్యంతమవుతున్నారు.

# పైసలిచ్చుకో.. పోస్టింగ్ పుచ్చుకో!

మొదటిపేజీ తరువాయి...

డివిజినల్ ఇంజినీర్ (డీఈ) పోస్ట్‌కు చాలా గిరాకీ ఉందని, అధికారులు ఎంత లంచమిచ్చి అయినా ఆ పోస్టులో కూర్చునేందుకు తహతహలాడుతున్నారని తెలుస్తున్నది. ఇటీవలే ఓ డీఈ పోస్ట్ రూ.40 లక్షలు పలికిందని విద్యుత్తుశాఖలో ప్రచారం జరుగుతున్నది. ఏబీసీ కేసు పెండింగ్‌లో ఉన్న ఓ ఇంజినీర్ అధికారి రూ.25 లక్షలు పెట్టి పోస్టింగ్ తీసుకున్నట్టు సమాచారం.

### ఖాళీ కాకముందే కర్చీఫ్

డిస్కంలలో డీఈ–ఆపరేషన్స్, డీఈ–టెక్నికల్ పోస్టులకు మంచి డిమాండ్ ఉన్నది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్‌లో పరిధిలో పోస్టింగ్ అంటే అత్యంత ఖరీదుతో కూడుకున్నదని విద్యుత్తుశాఖ అధికారులే చెప్తున్నారు. ఇవన్నీ ఫోకల్ పోస్టులే. ఆయా స్థానాల్లో తిష్టవేస్తే భారీగా లంచాలు తీసుకోవచ్చని, అందుకే ఆయా పోస్టుల పట్ల ఆసక్తి కనబరుస్తున్నారని వినికిడి. అంతేకాకుండా ఇటీవలీ కాలంలో డివిజినల్ ఇంజినీర్ల రిటైర్మెంట్స్ పెరిగాయి. దీంతో సదరు అధికారి రిటైర్ కాకముందే.. ఆ పోస్ట్ కోసం కొందరు అధికారులు పైరవీలు మొదలుపెడుతున్నారు. తెరవెనుక మంత్రాంగం నడిపిస్తున్నారు. ఫలానా డీఈ పోస్ట్ త్వరలోనే ఖాళీ అవుతుందనీ, ఆ తర్వాత అక్కడ చేరబోయేది తానేనని, ఇందుకు సంబంధించిన "ఫార్మాలిటీస్" అన్నీ పూర్తయ్యాయని కొందరు అధికారులు చెప్పుకుంటున్నారు. ఫలానా పోస్ట్ సేల్ అయిపోయిందని, ఫలానా అధికారి కర్చీఫ్ వేసుకున్నారని కూడా కొందరు చర్చించుకుంటున్నారు. విద్యుత్తు సంస్థల్లో చాలామంది అధికారులు అడ్డగోలుగా లంచాలు తీసుకుంటున్నారు. ఇటీవలీ కాలంలో రోజుకొకరు చొప్పున ఏసీబీకి చిక్కుతున్నారు. విద్యుత్తుశాఖలో ఇదంతా కామనేలే అన్నట్టుగా నడిచిపోతున్నది. ఏబీసీ కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ కీలక పోస్టులు కట్టబెట్టడమే ఇందుకు నిదర్శనమని ఉద్యోగ సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

### విత్యుత్తుశాఖ పోస్టింగ్స్‌లో వింతలు

- సంగారెడ్డి డీఈ–ఆపరేషన్స్ పోస్ట్ ఇటీవలీ ఖాళీ అయింది. ఈ పోస్ట్ కోసం పెద్దఎత్తున పైరవీలు నడుస్తున్నాయట. ఆ పోస్ట్ తనకు ఖాయమైందని, ఉత్తర్వులు రావడమే తరువాయి అని ఓ ఆంధ్రా అధికారి ప్రచారం కూడా మొదలుపెట్టారట.
- ఓ డివిజినల్ ఇంజినీర్ గద్వాలలో పనిచేస్తుండగా, మార్చి 25న బంజారాహిల్స్‌కు బదిలీచేశారు. ఆ వెంటనే సైబర్‌సిటీ సర్కిల్‌లో డీఈగా పోస్టింగ్ ఇచ్చారు. ఏం జరిగిందో ఏమోకానీ ఆయన స్థానాన్ని ఏప్రిల్ 15న మరో అధికారితో భర్తీ చేశారు. అడిగినంత ముట్టజెప్పకపోవడం వల్ల ఇలా జరిగిందని విద్యుత్తుశాఖలోని ఇంజినీర్లలో గుసగుసలు వినిపిస్తున్నాయి.
- రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ డీఈ రిటైర్ కాగా చంపాపేట డీఈకి ఉన్నతాధికారులు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఏప్రిల్ 30న ఉత్తర్వులు ఇచ్చారు. ఆ వెంటనే బేగంబజార్ డీఈకి కూడా సరూర్‌నగర్ డీఈగా అదనపు బాధ్యలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకే పోస్టుకు ఇద్దరు అధికారులకు బాధ్యతలివ్వడమేంటని సీజీఎం ఆఫీసులోనే చర్చ జరుగుతున్నది.

# ఆర్టీసీ సమ్మెపై యాజమాన్యం హ్యాండ్సప్!

మొదటిపేజీ తరువాయి...

మీడియా కథనాలు ఇవ్వగా.. అవన్నీ అవాస్తవాలని తేలిపోయింది. మంత్రి చర్చల్లో సమ్మె ప్రస్తావనే రాలేదని విశ్వసనీయంగా తెలిసింది. దీంతో ఇక ముఖ్యమంత్రి మాత్రమే ఆర్టీసీ సమ్మెపై నిర్ణయం తీసుకోగలరని ఊహాగానాలు వెలువడ్డాయి.

### రెండు ప్రధాన డిమాండ్లు

ఆర్టీసీ కార్మికుల సమ్మె డిమాండ్లలో ప్రధానమైనవి ఒకటి తమను ప్రభుత్వంలో విలీనం చేయడం, రెండోది కార్మిక సంఘాలపై నిషేధం ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడం. ఈ రెండు మినహా మిగిలిన డిమాండ్లను పరిష్కరించేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉన్నట్టు తెలిసింది. రెండు ప్రధాన డిమాండ్లపై ముఖ్యమంత్రి ఇచ్చే హామీని బట్టి సమ్మె ఆధారపడి ఉంటుందని ఇటు ప్రభుత్వ పెద్దలు, అటు కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

### చర్చలకు పిలువకపోతే సమ్మె తథ్యం..

తాము ఇచ్చిన సమ్మె డిమాండ్లపై ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించకపోతే సమ్మె తథ్యమని ఆర్టీసీ కార్మిక సంఘాలు తేల్చి చెప్తున్నాయి. తాము ప్రధానంగా ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించే వరకు వెనుకకు తగ్గేది లేదని హెచ్చరిస్తున్నాయి. అన్ని సమస్యలను పరిష్కరించాల్సిందేనని నాయకులు అంటున్నారు. ఆర్టీసీ సంస్థకు ఆర్థిక భారం కాకుండా.. నిధులు ఎలా సమకూర్చుకోవాలో సీఎం తమను చర్చలకు పిలిస్తే.. తామే చెప్తామని అంటున్నారు. యాజమాన్యం ఇకనైనా నిరంకుశ వైఖరి వీడి.. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.



# ఇండ్లకు అనుమతి ఏది?

మొదటిపేజీ తరువాయి...

డ్రాయింగ్స్ పరిశీలన నిమిషాల్లోనే పూర్తవుతుందని, ఇంటి అనుమతి మరింత సులభమవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి దానిని ప్రారంభించినప్పుడు ప్రకటించారు. అది ప్రారంభమై ఇప్పటికీ నెల రోజులు దాటినా.. పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదు. టెక్నికల్ లోపాలు నేటికీ వెక్కిరిస్తూనే ఉన్నాయి. కానీ, ఆన్‌లైన్‌లో సులభంగా ఇండ్ల అనుమతులు ఇచ్చిన టీజీ బీపాస్‌ను టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు నిలిపివేశారు. ప్రాసెస్‌లో ఉన్న దరఖాస్తులు మినహా కొత్తవి బిల్డ్‌నౌ విధానంలోనే తీసుకుంటామని స్పష్టంచేశారు. దాంతో పాతది పనిచేయక, కొత్తది అందుబాటులోకి రాక నరకం చూస్తున్నారు. ఇల్లు, అదనపు అంతస్తుల నిర్మాణ అనుమతుల కోసం బిల్డ్‌నౌను ఆశ్రయిస్తే నిర్మాణదారులకు ఇక్కట్లు తప్పడం లేదు.

### డీటీసీపీశాఖ వైఫల్యం

టీజీ బీపాస్‌లో కాడ్ ఫైల్ అప్‌లోడ్ చేయాలంటే ముందుగా ప్రీ డీసీఆర్‌లో కాడ్ ఫైల్ రన్ చేయాలి. అది సుమారు 15 రోజులుగా పనిచేయడం లేదు. దీనితో సింగిల్ విండో సిస్టమ్ ఫైల్స్‌ను టీజీ బీపాస్‌లో దరఖాస్తు చేయడం వీలుకావడం లేదు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలో మాత్రమే కొంత పనిచేస్తున్నది. డీటీసీపీ ఏరియాల్లో అంటే.. రాష్ట్రంలో ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో బిల్డ్‌నౌ పూర్తిస్థాయిలో అభివృద్ధి కాకపోవడంతో నిర్మాణదారులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. బిల్డింగ్ పర్మిషన్ల ఫైల్స్ పెద్ద మొత్తంలో పేరుకుపోతున్నాయి. డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ సంస్థ (డీటీసీపీ) వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ శాఖ సీఎం రేవంత్‌రెడ్డి చేతిలోనే ఉండటం, ఫిర్యాదు చేస్తే కక్షసాధింపు చర్యలు ఉంటాయనే ఉద్దేశంతో అధికారులకు ఎవరూ ఫిర్యాదు చేయడం లేదు. నల్లగొండలో ఇప్పటికే నిర్మించిన ఇంటిపై అదనపు అంతస్తు అనుమతి కోసం ఓ ఇంటి యజమాని నెల రోజులుగా పడరాని పాట్లు పడుతున్నారు. ఏ ఒక్క అధికారీ ఆయన సమస్యను పరిష్కరించడం లేదు. బిల్డ్‌నౌలో టెక్నికల్ సమస్యలు కూడా వేధిస్తున్నాయి. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ), ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) అప్లికేషన్లకు ఆప్షన్ కనిపించడం లేదు. బిల్డ్‌నౌ విధానంలో ఎదురవుతున్న సమస్యలపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా డీటీసీపీ అధికారులు స్పందించలేదు.

## సూసైడ్ బాంబ్ ఇస్తే.. పాక్‌పై యుద్ధం చేస్తా

### కర్ణాటక మంత్రి బీజెడ్ జమీర్ అహ్మద్ ఖాన్

బెంగళూరు: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కర్ణాటక మంత్రి బీజెడ్ జమీర్ అహ్మద్ ఖాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సూసైడ్ బాంబు ఇస్తే, తాను పాకిస్థాన్‌కు వెళ్లి, యుద్ధం చేస్తానని చెప్పారు. ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియోలో, ''అవసరమైతే నేను సూసైడ్ బాంబ్‌తో పాకిస్థాన్‌కు వెళ్తాను. నేను జోక్ చేయడం లేదు, జోష్‌తో మాట్లాడటం లేదు. దేశానికి నా అవసరం ఉంటే, నరేంద్ర మోదీ, అమిత్ షాలను నాకొక సూసైడ్ బాంబ్ ఇవ్వమనండి. అల్లా మీద ప్రమాణం చేసి చెప్తున్నాను. దానిని నేను కట్టుకుని, పాకిస్థాన్‌కు వెళ్తాను'' అన్నారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ''మనం ఇండియన్స్, హిందుస్థానీలం. పాకిస్థాన్‌తో మనకు సంబంధం లేదు. పాకిస్థాన్‌పై యుద్ధానికి సిద్ధం. యుద్ధం చేయడానికి నన్ను పంపిస్తే, ఓ మంత్రిగా నేను సిద్ధం. నేను వెళ్తాను, దేశం కోసం పోరాడుతాను'' అని చెప్పారు.

## వడదెబ్బతో ఇద్దరు మృతి



బోడ నర్ల (ఫైల్)



సాయిలు(ఫైల్)

నవీపేట/నిజాంసాగర్, మే 3:వడదెబ్బ తగిలి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇద్దరు దుర్మరణం చెందారు. కామారెడ్డి జిల్లా మహ్మద్‌నగర్ మండలం దూప్‌సింగ్ తండాకు చెందిన బోడ నర్ల (56)కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మూడ్రోజుల క్రితం ఉపాధిహామీ పనికి వెళ్లిన నర్ల.. ఇంటికి వచ్చాక ఎల్లారెడ్డికి వెళ్లాడు. ఊరు నుంచి తిరిగివచ్చినప్పటి నుంచి వాంతులు, విరేచనాలు కావడంతో బాన్సువాడ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. రెండ్రోజులుగా చికిత్స పొందుతున్న నర్ల శనివారం కన్నుమూశాడు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం మోకన్‌పల్లి కి చెందిన బంగారు సాయిలు (58) నలుగురు ఆడబిడ్డల తండ్రి. భిక్షాటన చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజూ మాదిరిగానే భిక్షాటన కోసం శుక్రవారం నిజామాబాద్‌కు వెళ్లాడు. ఎండతీవ్రత కారణంగా అస్వస్థతకు గురికాగా, కుటుంబ సభ్యులు నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.